క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



కోయిల్‌కొండ: మండలంలోని వింజమూర్‌కు చెందిన శివకుమార్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని శనివారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అందజేశారు. ఇందుకు కృషిచేసిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు వైద్యపరీక్షలు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని స్వరూప్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు షుగర్ పరీక్షలు, ఓపీ ఉచితంగా నిర్వహించనున్నట్లు డా. స్వరూప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీయూలో స్వచ్ఛభారత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు ఉందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధం పాటించాలని కోరారు. విద్యార్థులు కాలుష్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, ఏబీవీపీ నాయకులు శివనిత్వార్, ఓంప్రకాష్, జైపాల్, నాగేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ అభివృద్ధే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం 25వ వార్డు పరిధిలోని గచ్చిబౌలి, గోల్ మసీదు తదితర ప్రాంతాలను పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు వరద తాకిడికి గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జీజీహెచ్ ఆవరణలో తాగునీటి ఎద్దడి నివారణకు గాను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యుత్ బోరుమోటారును ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్లు సాదతుల్లా, మహమ్మద్ అబ్దుల్ రషీద్, ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

పరుగు పందెంలో బంగారు పతకం

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌కు చెందిన దివ్యాంగుడు లింగప్ప రాష్ట్రస్థాయి పరుగు పందెంలో బంగారు పతకం సాధించారు. ఈనెల 3న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అంగవైకల్యం జయించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లింగప్పను గ్రామస్తులు అభినందించారు.

పాఠశాలకు స్థలం కరువు



అడ్డాకుల: మండలంలోని వర్నె ప్రాథమిక పాఠశాలలో స్థల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల పక్కనే నివాస గృహం ఉండటంతో విద్యార్థులు పాఠశాలకు వెనుక వైపు నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తరగతి గదికి నాలుగైదు మీటర్ల దూరంలోనే నివాసగృహానికి కంచె ఏర్పాటు చేసుకున్నారు. దీంతో విద్యార్థులు కనీసం ప్రార్థన చేయడానికి కూడా వీలు లేకుండాపోయింది. ఇక ఆటల సంగతి చెప్పనవసరం లేదు. పాఠశాల ఎదుట తోటల సాగు, చెత్తాచెదారంతో విషసర్పాల బెడద నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదనపు కలెక్టర్‌గా ధన్వాడ వాసి

ధన్వాడ: జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ధన్వాడకు చెందిన మాకం రఘువరన్ నియామకంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. ధన్వాడకు చెందిన మాకం సత్యనారాయణ – అన్నపూర్ణ మొదటి సంతానం రఘువరన్ 2015 గ్రూప్–1 ఎంపికలో 12వ ర్యాంకు సాధించారు. డీపీఓగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.. జగిత్యాల జిల్లాలో అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

ఉత్సాహంగా వన మహోత్సవం

- విరివిగా మొక్కలు నాటిన అధికారులు



మోతీఘనపూర్‌లో మొక్కలు నాటుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్

రాజాపూర్(బాలానగర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం ఉత్సాహంగా సాగుతోంది. శనివారం వివిధ శాఖల అధికారులు, నాయకులు పెద్దఎత్తున మొక్కలు నాటారు. బాలానగర్ మండలం మోతీఘనపూర్ రైతువేదిక ఆవరణలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. వనాలు అంతరించి పోవడంతోనే సకాలంలో వర్షాలు కురవడం లేదన్నారు. ప్రతి ఒక్కరు పది మొక్కల చొప్పున నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాబూరావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ ప్రశాంత్‌రెడ్డి, ఎంపీఓ విజయకుమారి, ఏఈఓ ప్రత్యూష పాల్గొన్నారు.

- రాజాపూర్ రైతువేదిక ఆవరణలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఓ నరేందర్, ఏఈఓ శ్రీనివాస్, ఎంపీఓ వెంట్రాములు, భారతి నరహరి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



రాజాపూర్‌లో..

గండీడ్: వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో ఎస్సీ అభివృద్ధిశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారి పాండు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

భూత్పూర్: మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతువేదికల వద్ద నాటిన మొక్కల సంరక్షణపై ఏఈఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్, ఏఈఓ హర్షవర్ధన్, పీఏసీఎస్ సీఈఓ రత్నయ్య, రైతుబంధు కోఆర్డినేటర్ తిరుపతయ్యగౌడ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మిడ్జిల్: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. మండలంలోని లింగంపల్లిలో గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈఓ నరేష్, చెన్నయ్య పాల్గొన్నారు.



గండేడ్‌లో..



భూత్పూర్‌లో..



మిడ్జిల్ మండలం లింగంపల్లిలో..

సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్రం పీజీ విద్యార్థినులు సీనియర్లకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అనిత, అమీనా ముంతాజ్, వర్ధిని, ప్రియ, నాగలింగం పాల్గొన్నారు.

- జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు సీనియర్లకు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సుజీవన్ మాట్లాడుతూ విద్యార్థులు పూర్తిస్థాయిలో నైపుణ్యాలు కలిగి ఉండాలని.. అప్పుడే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కృష్ణమూర్తి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సందీప్‌కుమార్, మధుమోహన్ పాల్గొన్నారు.



జేపీఎన్‌సీలో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

పోలీసుల దాడి సరికాదు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విరసం ఆవిర్భావ సదస్సుపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తున్నట్లు తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టవిరుద్ధంగా పోలీసులు దాడులు చేయడం సరికాదన్నారు. విరసం సంఘానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మిడ్జిల్: మండల కేంద్రంలో శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. దుందుభీ వాగు నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని.. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగ్జీవన్‌రాం ఆశయాలు కొనసాగించాలి



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దివంగత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, వెంకన్న, గిరిధర్‌రెడ్డి, రాంలక్ష్మణ్, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, నర్సింహ పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశానికి బాబు జగ్జీవన్‌రాం చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రాం వర్ధంతి నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబా, సీజే బెనహర్, అవేజ్, అజ్మత్‌అలీ, నాగరాజు, చంద్రశేఖర్, ఫహీం తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్‌రాం అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో జంగయ్య, కృష్ణయ్య, శ్రీకాంత్, శ్రీను, భీంరాజ్, బాలరాజ్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో జగ్జీవన్‌రాం వర్ధంతి నిర్వహించారు. పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, జీజీ పాల్, భక్తరాజు, కమలాకర్, ప్రతాప్ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్

నిందితుడికి రిమాండ్



రాజాపూర్: తాళంవేసిన ఇళ్లను లూటీ చేయడంతో పాటు వాహనాల చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అందుకు సంబంధించిన వివరాలను శనివారం జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ముస్తఫానగర్ చెందిన సయ్యద్ తాలిబ్ వృత్తిరీత్యా వెల్డర్. అతడు పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడటంతో పాటు రాజాపూర్‌లో రెండు బైకులను ఎత్తుకెళ్లాడు. జడ్చర్ల, షాద్‌నగర్, తిమ్మాజీపేట, తాడూర్, అమరచింత ప్రాంతాల్లో 8 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. రాజాపూర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. 8 కేసులు బయటపడ్డాయి. అతడిని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రవి, ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, కానిస్టేబుల్ బాలు ఉన్నారు.

కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఆలయంలో పూజలు చేస్తున్న ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని పాత మోతీనగర్‌కు చెందిన వెంకట్రాములు శుక్రవారం రాత్రి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయడానికి వెళ్లగా.. అదే కాలనీకి చెందిన బోయ శివ, శశికుమార్, మూర్తి మరికొందరు అడ్డుకున్నారు. కులం పేరుతో దూషించడంతో పాటు ఆలయంలో నుంచి బయటకు పంపించారు. ఆ తర్వాత బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను సైతం దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



దేవరకద్రలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



హన్వాడ మండలం కొనగట్టుపల్లిలో..

నవాబుపేట: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా నాయకులు యాదయ్య, శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక చేపట్టాల్సిన సంస్కరణలపై ముందస్తు ప్రణాళికలు రచించిన మేధావి శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శివ, యాదయ్య, లక్ష్మీనారాయణ, శ్రీను, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

అడ్డాకుల: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పచ్చదనం పెంచడానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్, సూర్యనారాయణ, చెన్నగౌడ్, అరవింద్‌రెడ్డి, రాఘవేందర్, యశ్వంత్, బాషా పాల్గొన్నారు.

హన్వాడ: మండలంలోని కొనగట్టుపల్లిలో బీజేపీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామశివారులో మొక్కలు నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బుచ్చిరెడ్డి, రమణారెడ్డి, కృష్ణయ్యగౌడ్, ఇప్పలి ఆంజనేయులు, బాలగోపి, కేశవులు, బాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

దేవరకద్ర: ఏక్ పేడ్ మాకే నామ్‌సే కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర బీజేపీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, దేవన్నసాగర్, విద్యాసాగర్, నాగిరెడ్డి, వీరేష్, ఆంజనేయులు, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

మిడ్జిల్: దేశానికి శ్యాంప్రసాద్ ముఖర్జీ, బాబు జగ్జీవన్‌రాం అందించిన సేవలు మరవలేనివని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి, బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, నరేష్, దేవేందర్, అంజి, అరవింద్ పాల్గొన్నారు.

నల్లకుంట ఆక్రమణపై విచారణ



నల్లకుంట వద్ద విచారణ చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి

జడ్చర్ల: బాదేపల్లి పట్టణంలోని నల్లకుంటను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని శనివారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్ జేఈ మహేష్ పరిశీలించారు. నల్లకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రహరీ నిర్మిస్తున్నారన్న సమాచారం మేరకు అధికారులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. శ్మశానం పక్కనున్న తమ పట్టా భూమిలోకి వచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తుండటంతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు నిర్మాణదారులు వివరించారు. అయితే ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకు వచ్చి నిర్మించిన ప్రహరీని వెంటనే తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, బూరెడ్డిపల్లి శివారులోని గోదుమకుంటలో కూడా నిర్మాణ పనులు చేపట్టగా, అడ్డుకున్నట్లు తెలిపారు.

మైనార్టీలకు బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు..



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ మైనార్టీలకు చేసిందేమీ లేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. 2014లో షాద్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మోసం చేసింది ఎవరని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన బిల్లును కేంద్రానికి పంపించి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. మైనార్టీ గురుకులాల్లో కాంట్రాక్టర్లు, ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చడానికి బీఆర్‌ఎస్ హయాంలో విజిలెన్స్ నియామకం చేశారని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, నాణ్యమైన విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. జిల్లా కేంద్రంలో మైనార్టీ షాదీఖానాకు రూ. 25 కోట్లతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, షాఫైసల్, అవేజ్ అహ్మద్, అక్బర్, ముజీబ్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



గ్రామసభలో పాల్గొన్న ఎంపీఓ అనిల్‌కుమార్

చిన్నచింతకుంట: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీఓ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పంపల్లిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ.. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, దేవేందర్‌రెడ్డి, శాంతిరెడ్డి, సీతన్న, శేఖర్‌రెడ్డి, సంజన్న, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

సహకార సంఘాలతో రైతులకు మేలు



నవాబుపేటలో అంతర్జాతీయ సహకార దినోత్సవంలో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు

నవాబుపేట: వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతోందని సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నవాబుపేట సింగిల్‌విండో వద్ద సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, రుణాలు అందిస్తూ అన్నివిధాలా అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రతాప్, శశిధర్‌రెడ్డి, వెంకటేష్, మాజీ సర్పంచులు గోపాల్‌గౌడ్, కృష్ణయ్య, సీఈఓ హన్మంతు పాల్గొన్నారు.

భూత్పూర్: స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో అంతర్జాతీయ సహకార అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ కదిరె శేఖర్‌రెడ్డి జెండాను ఎగురవేశారు. వైస్‌చైర్మన్ శ్రీనివాసులు, డైరెక్టర్లు అంజయ్య, రాంరెడ్డి, యాదయ్య, రాములు, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీఈఓ రత్నయ్య పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద సహకార సంఘం జెండాను చైర్మన్ సురేందర్‌రెడ్డి ఎగరవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సహకారంతో సింగిల్‌విండోను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ బషీర్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు శాంతిరెడ్డి, సుదర్శన్, దేవేందర్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



భూత్పూర్ సింగిల్‌విండో వద్ద జెండా ఎగరవేస్తున్న చైర్మన్ అశోక్‌రెడ్డి

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



వర్నెలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అడ్డాకుల: మండలంలోని వర్నెలో ప్రధాన రహదారి పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇళ్ల మధ్యన తక్కువ ఎత్తులో నిర్మించిన చిన్న దిమ్మెపై నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు. అక్కడ ఎలాంటి కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో చిన్నారులు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జూరాలకు స్వల్పంగా వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద స్వల్పంగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 768 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 131 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.389 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

కోయిల్‌సాగర్ 17.9 అడుగులు..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయంలో శనివారం సాయంత్రం 17.9 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు వివరించారు. వానాకాలం ప్రారంభంలో 10.6 అడుగుల నీటిమట్టం ఉండగా.. ఎత్తిపోతల ద్వారా 7.3 అడుగులకు చేరిందని చెప్పారు. జూరాల నుంచి మూడురోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని.. ప్రస్తుతం పెద్దవాగు ద్వారా కొద్దిపాటి నీరు చేరుతుందన్నారు. మరో 8.9 అడుగుల నీరు చేరితే పాత అలుగుస్థాయికి చేరుకుంటుంది.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,369

జడ్చర్ల: పట్టణంలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మొక్కజొన్న గరిష్టంగా రూ.2,369, కనిష్టంగా రూ.2,119 ధరలు లభించాయి. అలాగే ధాన్యం హంస రకం రూ.1,806 పలికింది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం జిల్లా కేంద్రంలో ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్, అక్రమ రవాణాపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో ప్రభ, ద్వితీయ నందిని, తృతీయ స్థానంలో సాయిప్రశాంత్ నిలిచారు.

